# గిరిజనులను విస్మరిస్తున్న ప్రజాస్వామ్య వ్యవస్థలు

పి. శివరామకృష్ణ

శాసన సభలు, కార్యనిర్వాహక వర్గం, న్యాయస్థానాలు ఈ మూడింటికి గిరిజన సమస్యలయెడ గల శ్రద్ధ చాలా పాక్షికమైనది. అందుకు ఎన్నెన్నో ఉదాహరణలు చూపించవచ్చు.

షెడ్యూలు ప్రాంతాలలో గిరిజన జనాభా 60 శాతం. కాని అక్కడి జూనియర్, డిగ్రీ కాలేజీలలో గిరిజనుల కున్న సీట్లు 7 శాతంమాత్రమే. మిగతా సీట్లన్ని మెరిట్లో గిరిజనేతరులు సంపాదించుకుంటున్నారు. చాలా మంది గిరిజన విద్యార్థులు సీట్లు దొరకక బాధ పడుతున్నారు. ప్రాజెక్టు ఆఫీసరు జోక్యంతోనో, వచ్చిన వారందరికీ సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పుడు తప్ప అత్తెసరు మార్కులతో పాసయ్యే గిరిజనులకు ఈ కళాశాలలో సీట్లు దొరకవు. గిరిజనుల కోసం షెడ్యూల్డు ప్రాంతాలలో విధిగా 30 - 40 శాతం సీట్లు ఈనాటికీ రిజర్వు చేయకపోవడం దురదృష్టకరం.

ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, చదివే బలహీన వర్గాల విద్యార్థులకు వసతి ఉండదు. చిన్న చిన్న పట్టణాల్లో అద్దెలు చెల్లించుకుంటూ వారు చదువుకుంటూ ఉండాలి. ఈ దశలో అయ్యే ఖర్చులు కూడా ఎక్కువే. దీనివల్ల ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ లేదు.

1984 నుండి అడవి పనులలో [పేపర్ మిల్లుల వెదురుకు, అటవీశాఖకు కలపకోత] కనీస కార్మిక వేతనాలను కార్మిక శాఖ ఇంతవరకు సవరించలేదు. దీనిపై హైకోర్టులో వేసినా రిట్‌కు ప్రభుత్వం నుండి సమాధానం లేదు. ముఖ్యమైన కూలీ సమస్య గూర్చి వెంటనే స్పందించాలని కోర్టు కూడా ప్రభుత్వాన్ని ఆదేశించడంలేదు. ఏజెన్సీలో కనీస వేతనాలు అమలు జరగడంలేదనే అభియోగానికి జవాబేలేదు.

ట్రైనింగ్ కోసం గిరిజనేతరులకు

షెడ్యూలు ప్రాంతంలో గి~~రిజన సహకార సంఘాలకు~~, ఇచ్చిన లీజులన్నీ చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని శాఖలకు తెలియపర్చారు. కాని ఒక్క లీజూ రద్దు కాలేదు. అయినప్పటికీ న్యాయ శాఖ [రాష్ట్ర ప్రభుత్వం] గిరిజనేతరులకు లీజు చెల్లుతుందని ఉచిత సలహా ఇస్తున్నది. ఇటీవల వివాదాస్పదంగా మారిన అడవుల నరికివేత ఉత్తర్వులు జి. వో. నెం. 185 - ఈ న్యాయశాఖ సలహా పుణ్యమే.

ప్రాథమిక సహకార సంఘాలలో గిరిజన ప్రాంతం జనాభాకు తగ్గట్టు గిరిజనులకు సీట్లను రిజర్వు చేయలేదు. అందువల్ల షెడ్యూల్డు ఏరియాల సహకార సంఘాలన్నీ గిరిజనేతరుల గుప్పిట్లో ఉన్నాయి. కర్షక పరిషత్‌లో అసలు రిజర్వేషనే లేదు. దాన్ని కోర్టులో సవాలు చేయడం జరిగింది.

1983 నుండి గిరిజన సహకార సంస్థ దానికి అనుబంధ సహకార సంస్థలకు ఎన్నికలు జరగలేదు. ఈ విషయం కోర్టు దృష్టికి తెచ్చినప్పటికి వాయిదాలు పడుతున్నాయి కాని ఎన్నికలు జరగడంలేదు. 1987 లో కోర్టు తీర్పును బట్టి రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఆ తీర్పు ప్రకారం ఎన్నికలు జరిపించండి అన్నా కోర్టు వినిపించుకోదు. ప్రభుత్వం పట్టించుకోదు.

సబ్ డివిజనల్ కోర్టులు, జిల్లా కోర్టులు సాధారణ చట్టాల ప్రకారం గిరిజనులకు సంబంధించిన కేసుల్లో తీర్పు చెబుతున్నాయి. గిరిజనుల కులాచారం ప్రకారమే తీర్పు చెప్పాలని రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశిస్తున్నప్పటికీ, ఆ మాటలు కోర్టులో చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. శిక్షాస్మృతి, సివిల్ కోడ్‌లో ఏ మార్పు లేకుండా కొత్తగా ప్రభుత్వం పెట్టిన మొబైల్ కోర్టుల వల్ల ఏమీ ఉపయోగం ఉండదు. గిరిజనులను కలుపుకోకుండా కుల తగవులు తేల్చడం సాధ్యమయ్యేదికాదు.

1963 నుండి తెలంగాణా షెడ్యూలు ప్రాంతంలో అమలు జరుగుతున్న భూమి అన్యాక్రాంత విచారణ చట్టం 1959 నుండి అమలు జరగాలనీ, సెటిల్మెంటు పట్టాలను విచారణ చేసే అధికారాలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాలని గిరిజన శాసన సభ్యుల సలహా సంఘాలు తీర్మానాలు చేశాయి. అంతేకాక షెడ్యూల్డు ప్రాంతంలో చిన్న రైతులే కాక గిరిజనేతర భూస్వాములు కూడా బంజర్లను ఆక్రమించుకొని ఉన్నారు. వాళ్ల నుండి ఒక్క సెంటు పొలం రాబట్టి గిరిజనుడి కిచ్చే ఉద్దేశం, ధైర్యం ప్రభుత్వానికి లేవు. వరంగల్ జిల్లా గోవిందరావుపేట మండలంలో ప్రభుత్వ భూములలో గిరిజనేతరులను తొలగించవద్దని ఒక తాఖీదు జారీచేసింది. 'తెలుగు గిరిజన మాగాణీ సమారాధన' అనే బడాయి నినాదాల పేరిట వంచిపెట్టింది - కొండలు, గుట్టలు. గిరిజన భూముల వివాదాలను సమీక్షించడానికి ఒక జాయింటు కలెక్టర్ హోదా గల అధికారిని రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖలో నియమించి 20 రోజులలోనే బదిలీచేసి ఆ పోస్టు ఖాళీగా ఉంచింది. ఆ పోస్టు ఉండవలసింది గిరిజన సంక్షేమ శాఖలో కాదు కమిషనర్ సెటిల్మెంట్ ఆఫీసులో. భూమి సమస్య మీద కేవలం షో-కాజ్ నోటీసు ఇస్తే చాలు గిరిజనేతరుడికి ఆర్టికల్ 226 కింద హైకోర్టు సస్పెన్షన్ ఉత్తర్వులను మంజూరు చేస్తుంది. విచారణ స్తంభింపచేస్తుంది. విచారణ కూడా నిలుపు చేస్తే మరి వాస్తవాలు తెలిసేది ఎలా? ఒకటో రెండో లైన్లు ఉండే ఆ తీర్పులో విచారణ ఆపేసి ఏం చేయాలో చెప్పరు. ఆ సస్పెన్షన్ ఆర్డరు తిరగదోడేందుకు మళ్లీ కోర్టు కెళ్లాలి. కోర్టుకు ఎవరైనా ఒక్కటే. గిరిజనులు కూడా ఇలా కోర్టు చుట్టూ తిరుగుతూ ఉండాల్సిందే. ఈ పాట్లు పడలేక గిరిజనులు ప్రజా కోర్టులకు పోతున్నారు.

గిరిజన ప్రాంతంలోని లోతట్టు మండలంలో గిరిజనుల పొలాల్లో చెట్లు చేమా అధిక సంఖ్యలో ఉంటాయి. వీటిని అవసరమైనంతవరకు నరికివేసి వ్యవసాయంలోకి తెచ్చుకోవడం కాని లేదా ఆ చెట్ల నీడన కాఫీ వగైరా ప్లాంటేషన్లు పెంచడం గానీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. కాని ఇలా తొలగించిన దుంగల తగిన రేటుకు అమ్మి పెట్టడానికి మాత్రం అటవీ శాఖ ముందుకు రాదు. మార్కెట్టు రేటు సుమారు 700 రూ. ఉండగా టన్ను దుంగలను గిరిజనుడు 30 రూపాయలకే అక్రమ రవాణాదార్లకు అమ్ముతుంటారు. ఆ రకంగా ఎక్కువ సొమ్ము కోసం ఎక్కువ అడవి నరకక తప్పడంలేదు. అటవీ శాఖ తమకు లంచాలిచ్చేగల కాంట్రాక్టర్లకు మాత్రమే రవాణా పర్మిట్లు ఇస్తున్నది.